సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

మంగళవారం । 15 । ఏప్రిల్ । 2025



8 లో

ఔషధ గుణం.. ఆరోగ్య ప్రదం


వేసవి తాపాన్ని అధిగమించేందుకు, శరీరంలో సంభవించే అనేక రుగ్మతలను నివారించి ఆరోగ్య ప్రయోజనాలను చేకూర్చేందుకు ప్రకృతి ప్రసాదించిన తాటిముంజలు ఐస్ యాపిల్‌గా విశేష ప్రాచుర్యం పొందాయి.



సరదా తెచ్చిన తంటా

విజ్జేశ్వరం లాకులకు దిగువన చిగుర్లంక వద్ద సరదాగా స్నానానికి వెళ్లిన ముగ్గురు యువకుల్లో ఇద్దరు యువకులు గల్లంతయ్యారు. మరొకరిని స్థానికులు కాపాడారు.

డెల్టాలకు 6,800 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 6,800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 1,500, మధ్య డెల్టాకు 1,300, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.70 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

హోరాహోరీగా చదరంగం పోటీలు



బహుమతులు సాధించిన విద్యార్థులు

అమలాపురం రూరల్: కోనసీమ డిస్ట్రిక్, ఆంధ్రా చెస్ అసోసియేసషన్, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో అమలాపురం మండలం కామనగరువులో ఢిల్లీ పబ్లిక్ స్కూలో కోనసీమ డిస్ట్రిక్ట్ ఓపెన్ చదరంగ పోటీలు హోరాహోరీగా జరిగాయి. పోటీలకు జిల్లా నలుమూలల నుంచి 250 మందికి పైగా విద్యార్థులు తరలివచ్చారు.

బి.నానిబాబు ప్రథమ స్థానం సాధించి రూ.4,000 నగదు బహుమతి, డి. సాత్విక్ ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుని రూ.3,000 గెలుచుకున్నాడు. టి.సాయి వెంకటేష్ తృతీయ స్థానం సాధించి రూ.2000 గెలుపొందాడు. ఏడు స్థానాల్లో విజేతలకు నగదు బహుమతులను డీపీఎస్ స్కూల్ చైర్మన్ నంద్యాల నాయుడు, డైరెక్టర్ నంద్యాల మను విహార్ సోమవారం అందజేశారు. ఈ పోటీల్లో అండర్ 9, 11, 13, 15 విభాగాల్లో మొదటి ఐదుస్థానాలకు స్త్రీ, పురుషులకు విడివిడిగా నగదు బహుమతి, ట్రోఫీలు, మెడల్స్ అందజేశారు. విజేతలను చెస్ డిస్ట్రిక్ట్ సెక్రటరీ తాడి వెంకట సురేష్‌కుమార్, స్కూల్ ప్రిన్సిపాల్ దేవి దీక్షిత్, చీఫ్ ఆర్బిటర్ జీవీ కుమార్, టోర్నమెంట్ డైరెక్ట్ శ్రీనుబాబు అభినందించారు.

అయినవారి కోసం ఐవీఆర్ఎస్

- టీడీపీ అధినాయకత్వం వింత పోకడ
- రెండు మార్కెట్ యార్డులకు చైర్మన్‌ల ఎంపికకు ఒక్కొక్క పేరుతో ఐవీఆర్ఎస్
- విడ్డూరంగా ఉందంటున్న కార్యకర్తలు



అమలాపురం మార్కెట్ కమిటీ కార్యాలయం

సాక్షి, అమలాపురం: పదవి మనోడికివ్వాలి... కాని పెద్ద ఎత్తున కసరత్తు చేసినట్టు కనిపించాలి అనే సూత్రాన్ని అధికార టీడీపీ బాగా ఒంటబట్టించుకుంది. ఇప్పటి వరకు ఎంపీ.. ఎమ్మెల్యే.. ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికకు మాత్రమే వినియోగించే ఇంట్రాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టం (ఐవీఆర్ఎస్)ను టీడీపీ అధిష్టానం చివరకు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులకు సైతం వినియోగిస్తోంది. కోనసీమ జిల్లాలో మొత్తం తొమ్మిది మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులకుగాను ఇప్పటి వరకు నగరం, ఆలమూరు, మండపేట ఏఎంసీలకు చైర్మన్‌లను ఎంపిక చేశారు. ఇంకా కొత్తపేట, రామచంద్రపురం, అమలాపురం, తాటిపాక, అంబాజీపేట, ముమ్మిడివరం మార్కెట్ కమిటీలకు చైర్మన్లను, పాలకవర్గాలను నియమించాల్సి ఉంది. వీటిలో అమలాపురం, అంబాజీపేట ఉత్కంఠను రేపుతున్నాయి. ఈ రెండు మార్కెట్ కమిటీలను తమకు కేటాయించాలని జనసేన పార్టీ నుంచి తీవ్ర ఒత్తిడి ఉన్నా ఆ రెండు చైర్మన్ పదవులను పొత్తులో టీడీపీ తమకు వచ్చేలా చేసుకుంది. అంతటితో సరిపోదన్నట్టుగా కీలకమైన అంబాజీపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి తమ పార్టీకి మొదటి నుంచి దన్నుగా ఉన్న పార్టీకి చెందిన కమ్మ సామాజిక వర్గానికి ఇచ్చేందుకు పావులు కదిపింది. ఇందుకు ఐవీఆర్ఎస్‌ను తెరపైకి తెచ్చింది.

ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల నిర్ణయించేందుకు చంద్రబాబు తెచ్చిన ఈ విధానంలో ఫోన్ ద్వారా పార్టీ కార్యకర్తలు, నాయకులతోపాటు ఎంపికచేసిన ఓటర్ల నుంచి అభిప్రాయ సేకరణ తీసుకుంటోంది. కాని అంబాజీపేట ఏఎంసీ చైర్మన్ పదవికి మాత్రం పార్టీ పెద్దలు నిర్ణయించిన అయినవిల్లికి చెందిన చిట్టూరి శ్రీనివాస్ ఒక్క పేరు మీదనే అభిప్రాయ సేకరణ చేయడం విశేషం. రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ కోటరీకి చెందిన శ్రీనివాస్‌కు పదవి ఇవ్వడం పెద్ద విషయం కాదు. కాని ఇందుకు ఐవీఆర్ఎస్ అంటూ హడావుడి చేయడం విడ్డూరంగా ఉందని తమ్ముళ్లు అభిప్రాయపడుతున్నారు. అమలాపురం ఏఎంసీకి సహితం ఇదే విధానాన్ని అవలంబించారు. ఇక్కడ పోటీ ఎక్కువగా ఉన్నా జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు అధికార జయ వెంకటలక్ష్మికి ఈ పదవి ఇప్పించాలని స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు భావిస్తున్నారు. ఇందుకు అధిష్టానం నుంచి అనుమతి పొందారు. ఈ పదవి సైతం జయ వెంకటలక్ష్మి ఒక్క పేరు మీదనే ఐవీఆర్ఎస్ చేయడం గమనార్హం.

● రోడ్డు టెర్రర్..

మృత్యు యాత్ర

దైవ దర్శనానికి వెళ్లి అనంత లోకాలకు..

- లారీని వెనుక నుంచి ఢీకొన్న కారు
- ముగ్గురి మృతి, మరో ముగ్గురికి తీవ్ర గాయాలు
- తెలంగాణలోని జనగామ జిల్లాలో ప్రమాదం
- మృతులు కోనసీమ వాసులు





మృతి చెందిన అనూష, శ్రీను, రమణకుమారి



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

స్టేషన్ ఘన్‌పూర్: ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి కారు వేగంగా ఢీకొన్న ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. తెలంగాణలోని జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ మండలం రాఘవాపూర్ శివారులో సోమవారం సాయంత్రం ఈ ప్రమాదం జరిగింది. వివరాల్లోకి వెళితే.. ఉప్పలగుప్తం మండలం సవరప్పాలేనికి చెందిన సత్తి అనంతలక్ష్మి, రాజేశ్వరరావు కుటుంబం పదేళ్లుగా హైదరాబాద్‌లోని గాజులరామారంలో నివసిస్తోంది. అనంతలక్ష్మి, రాజేశ్వరరావు, వారి కుమారుడు శ్రీను (48), కోడలు రమణకుమారి (40), మనుమడు, మనవరాలు సత్య అరవింద్, అనూష (22) కలసి జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో దైవ దర్శనం కోసం హైదరాబాద్ నుంచి సోమవారం ఉదయం కారులో బయలుదేరి వెళ్లారు. దర్శనం అనంతరం తిరిగి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు. సాయంత్రం 5 గంటల ప్రాంతంలో వీరు ప్రయాణిస్తున్న కారు రాఘవాపూర్ శివారులో జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి వేగంగా వెళ్లి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ కిందకు కారు దూసుకెళ్లి నుజ్జునుజ్జయింది. కారు నడుపుతున్న శ్రీను, అతని భార్య రమణ కుమారి, వారి కుమార్తె అనూష అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కారులో తీవ్ర గాయాలతో ఉన్న అనంతలక్ష్మి, రాజేశ్వరరావు, సత్య అరవింద్‌లను జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో తర్వాత వారిని హైదరాబాద్‌కు తరలించారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్, స్టేషన్ ఘన్‌పూర్ ఏసీపీ భీమ్‌శర్మ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులు దాదాపు రెండు గంటల పాటు కష్టపడి గడ్డపార, క్రేన్ సహాయంతో కారు డోర్లు తొలగించి మృతదేహాలను బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు.





గాయపడ్డ రాజేశ్వరరావు, అనంతలక్ష్మి, అరవింద్

కాలువల మూసివేత సాధ్యమేనా?



కోనసీమ జిల్లా మధ్య డెల్టా ప్రధాన పంట కాలువపై లొల్ల లాకులు



గత ఫిబ్రవరి నెలలో కాకినాడ జిల్లా కరపలో నీటి ఎద్దడి బారిన పడిన వరి చేలు

- నేడు మూసివేయడానికి సన్నాహాలు
- ఇప్పటికీ శివారు పొలాలకు సాగు నీటి అవసరం
- మరో ఐదు రోజులు పెంచాలని కోరుతున్న వ్యవసాయ శాఖ
- తాగునీటి ప్రాజెక్టుల కోసం కూడా గడువు పెంచాల్సిందే..
- రబీలో ఇప్పటి వరకూ 111 టీఎంసీల వినియోగం
- అయినా శివారుల్లో కీలక సమయంలో సాగునీటి ఎద్దడి
- నీటి యాజమాన్యంలో అట్టర్ ఫ్లాప్

సాక్షి, అమలాపురం: గోదావరి డెల్టా పంట కాలువల మూసివేతకు సాగునీటి పారుదల శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం మంగళవారం అర్ధరాత్రి నుంచి మూడు ప్రధాన పంట కాలువలకు నీటి విడుదల నిలిపివేయాల్సి ఉంది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద హెడ్ స్లూయిజ్ గేట్లు మూసివేసేందుకు అన్ని ఏర్పాట్లూ చేసుకున్నారు. అయితే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో రబీ వరి సాగుకు మరో ఐదు రోజుల పాటు నీరందించాలని వ్యవసాయ శాఖ అధికారులు కోరుతున్నారు. ఈ మేరకు ఈ నెల 20వ తేదీ వరకూ గడువు పెంచే అవకాశముందని సాగునీటి పారుదల శాఖ అధికారులు చెబుతున్నారు. దీనిపై మంగళవారం తుది నిర్ణయం తీసుకోనున్నారు.

నేడు నిర్ణయం

డెల్టాలో రబీ సాగుకు మరో ఐదు రోజుల పాటు గడువు పెంచే అవకాశముంది. దీనిపై మంగళవారం ధవళేశ్వరంలో తుది నిర్ణయం తీసుకోనున్నారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం మంగళవారం అర్ధరాత్రి తరువాత బ్యారేజీ గేట్లు మూసివేసేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే కోనసీమ జిల్లా వ్యవసాయ అధికారి బోసుబాబు అభ్యర్థించడంతో ఇరిగేషన్ సర్కిల్ సూపరింటెండెంట్ గోపీనాథ్, గోదావరి డెల్టా సిస్టమ్ చీఫ్ ఇంజినీరు (సీఈ) దీనిపై మంగళవారం తుది నిర్ణయం తీసుకోనున్నారు. వ్యవసాయ శాఖతో పాటు తాగునీటి చెరువులు పూర్తిస్థాయిలో నింపాల్సి ఉన్నందున ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కూడా గడువు పెంచాల్సిందిగా కోరుతున్నారు. ఈ కారణంగా కాలువల మూసివేత గడువును ఈ నెల 20 వరకూ పెంచే అవకాశముందని సమాచారం.

డెల్టా ప్రధాన పంట కాలువలకు డిసెంబర్ 7 నుంచి ఏప్రిల్ 14వ తేదీ వరకూ నీటి విడుదల (టీఎంసీలలో..)

తూర్పు డెల్టా	: 34.293
మధ్య డెల్టా	: 20.291
పశ్చిమ డెల్టా	: 56.478

నీటి యాజమాన్యంలో సమన్వయ లోపం

గోదావరి మూడు డెల్టాల పరిధిలో సుమారు 8.86 లక్షల ఎకరాల్లో వరి, ఇతర వ్యవసాయ పంటలు సాగవుతున్నాయి. ఈ సీజన్‌లో సాగుకు, తాగునీరు, పారిశ్రామిక అవసరాలకు కలిపి మొత్తం 90 టీఎంసీలు ఉంటే సరిపోతుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో తూర్పు, మధ్య డెల్టాలో 4.80 లక్షల ఎకరాల్లో వరి ఆయకట్టు ఉంది. దీనిలో సుమారు 4.20 లక్షల ఎకరాల్లో రబీ వరి సాగు జరిగిందని అంచనా. పంట కాలువలు, చానల్స్ అధ్వానంగా ఉన్నాయి. ఈ ఏడాది రబీ సాగు ఆరంభంలో షార్ట్ క్లోజర్ పనులు చేస్తామని చెప్పారు. కానీ పూడిక తీత, గుర్రపుడెక్క తొలగింపు పనులు చేయలేదు. ఇది సాగు నీటి సరఫరాకు ప్రధాన అవరోధంగా మారింది. దీనికితోడు నీటి యాజమాన్య విషయంలో అధికారుల మధ్య సమన్వయం కొరవడటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

డెల్టాకు 111 టీఎంసీలు

గోదావరి డెల్టాలో డిసెంబర్ 7వ తేదీన మొదలైన రబీ షెడ్యూలులో ఈ నెల 15 వరకూ 111.355 టీఎంసీల నీటిని పంట కాలువలకు విడుదల చేయాలని నిర్ణయించారు. దీనిలో తూర్పు డెల్టాకు 34.293, మధ్యడెల్టాకు 20.291, పశ్చిమ డెల్టాకు 56.478 టీఎంసీల చొప్పున అందించారు. రబీ సాగు, ఇతర అవసరాలకు వాస్తవంగా 90 టీఎంసీలయితే సరిపోతుంది. కానీ అంతకన్నా అధికంగా నీరు ఇచ్చామని అధికారులు చెబుతున్నారు. అయినా డెల్టా శివారులు, మెరక ప్రాంతాల్లో ఫిబ్రవరి, మార్చి నెలల్లో తీవ్ర నీటి ఎద్దడి ఎదుర్కొన్న విషయం తెలిసిందే. తూర్పు డెల్టా, పిఠాపురం బ్రాంచ్ కెనాల్, మధ్య డెల్టా అనే తేడా లేదు. తూర్పు గోదావరి, కాకినాడ, కోనసీమ జిల్లాల్లోని ఇంచుమించు అన్ని మండలాల్లోనూ ఏదో ఒక సందర్భంలో రైతులు నీరందక ఇబ్బంది పడ్డారు. తూర్పు డెల్టాలో కరప, కాజులూరు, తాళ్లరేవు, కె.గంగవరం, పీబీసీలో కొత్తపల్లి, మధ్య డెల్టా పరిధిలో ముమ్మిడివరం, కాట్రేనికోన, ఐ.పోలవరం, ఉప్పలగుప్తం, అల్లవరం, మలికిపురం మండలాల్లో చేలు నెర్రెలు తీసిన విషయం తెలిసిందే.

వంట కాలువలకు విడుదల చేసిన నీటితో పాటు డెల్టాలో పలుచోట్ల వ్యవసాయ విద్యుత్ మోటార్లతో చేలకు పెద్ద ఎత్తున నీరందించారు. ఇలా కనీసం ఒకటిన్నర టీఎంసీ, మురుగునీటి కాలువలపై క్రాస్‌బండ్లు వేసి కూడా నీటిని చేలకు మళ్లించడం ద్వారా మరో ఐదు టీఎంసీల వరకూ నీటిని చేలకు తరలించామని అధికారులు చెబుతున్నారు. ఇలా చూస్తే మొత్తం 117.50 టీఎంసీల నీటిని రబీ కాలంలో అందించినట్టు. అయినప్పటికీ తూర్పు, మధ్య డెల్టాలోని ఏకంగా 11 శివారు మండలాల్లో సాగుకు నీటి ఎద్దడి ఏర్పడిందంటే అది ముమ్మాటికీ నీటిపారుదల శాఖ అధికారులు నిర్లక్ష్యమేనని రైతులు చెబుతున్నారు. నీటి ఎద్దడి ప్రభావంతో రైతులు పలు రకాల ఇబ్బందులను ఎదుర్కొన్నారు. పంట బోదెలు, చానల్స్ నుంచి, డ్రెయిన్ల నుంచి మోటార్లతో నీరు తోడకం వల్ల ఎకరాకు అదనంగా రూ.మూడు వేల నుంచి రూ.ఐదు వేల వరకూ పెట్టుబడి అయ్యింది. ఎద్దడికి గురైన ప్రాంతంలో దిగుబడి పడిపోవడంతో.. లాభాలు రావడం మాట అటుంచి పెట్టుబడులు వస్తే గొప్ప అన్నట్టుగా పరిస్థితి మారిందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

జగ్గిరెడ్డికి వైఎస్సార్ సీపీ శ్రేణుల అభినందనలు



జగ్గిరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, పాపారాయుడు తదితరులు

రావులపాలెం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి నియమితులైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయనకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అభినందనలు తెలిపారు. సోమవారం గోపాలపురంలోని జగ్గిరెడ్డి స్వగృహానికి వచ్చిన ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు అభినందనలు తెలిపారు. అలాగే మండపేట మండల జెడ్పీటీసీ కురుపూడి భవాని రాంబాబు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పలివెల సుధాకర్ ఇతర నాయకులతో కలిసి గోపాలపురంలోని జగ్గిరెడ్డి నివాసానికి వచ్చారు. ఈ సందర్భంగా జగ్గిరెడ్డికి శాలువా కప్పి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జగ్గిరెడ్డి నాయకత్వంలో జిల్లాలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆకాంక్షించారు.

జీవో 35తో జెడ్పీ ఏవోలకు అన్యాయం

అమలాపురం టౌన్: పంచాయతీరాజ్ శాఖలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకుని వచ్చిన జీవో నెం.35తో ఎంపీడీవో కార్యాలయాల్లో పనిచేస్తున్న ఏవోలకు పదోన్నతులపరంగా తీరని అన్యాయం జరుగుతోందని అమలాపురానికి చెందిన ఆంధ్ర ప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్ట్రీ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కాండూరి శ్రీనివాసరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు అమలాపురంలో ఆయన సోమవారం ప్రకటన విడుదల చేశారు. జిల్లా పరిషత్ పర్యవేక్షణలో ఎంపీడీవో కార్యాలయాల్లో పనిచేసే ఏవోలు ఈ జీవోను పూర్తిగా వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు. ఈ జీవో వల్ల ఏవోలు ఎంపీడీవోలుగా పదోన్నతి పొందాలంటే చాలా కష్టమని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఫీడర్ కేటగిరికి అనుగుణంగా ఎంపీడీవోల పదోన్నతుల్లో ఏవోలకు 34 శాతం అమలు చేసేవారని, ఇప్పుడు 27 శాతానికి కుదించడం దారుణమని పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ జీవోను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి



బందారుపేటలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి



కలెక్టరేట్‌లో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, జేసీ, అధికారులు

కొత్తపేట: భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక బందారుపేటలో జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు, మండల యువజన విభాగం అధ్యక్షుడు గొల్లపల్లి స్వరూప్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి జగ్గిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అసమానతలతో అనేక వర్గాలు అవమానాలు ఎదుర్కొంటున్న పరిస్థితులను రూపుమాపి సమసమాజ నిర్మాణానికి, అన్ని వర్గాల ఆర్థిక స్వాతంత్ర్యానికి అనుగుణంగా దేశానికి గొప్ప రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు అంబేడ్కర్ అని అన్నారు. అనంతరం బాలలకు పుస్తకాలు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మార్గన గంగాధరరావు, అవిడి సర్పంచ్ రెడ్డి చంటి, ఎంపీటీసీ సభ్యులు పేపకాయల బ్రహ్మానందం, ముళ్ల జనార్దన్, గ్రామ పార్టీ అధ్యక్షుడు సలాది బ్రహ్మాజీ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో..

అమలాపురం రూరల్: అంబేడ్కర్ ఒక వ్యక్తి మాత్రమే కాదు.. ఒక భావజాలమని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ గోదావరి భవన్‌లో అంబేడ్కర్ 134 వ జయంతి వేడుకలు నిర్వహించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ అంబేడ్కర్, మహాత్మాగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గోదావరి భవన్‌లో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జయంతి సభలో కలెక్టర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాణంలో అంబేడ్కర్ కీలక పాత్ర పోషించారన్నారు. జాయింట్ కలెక్టర్ టీ. నిషాంతి మాట్లాడుతూ..అంబేడ్కర్ జీవితం ఒక వ్యక్తిగత గాథ మాత్రమే కాదని కోట్లాదిమంది శోషితుల ఆశ, నమ్మకం, మార్గదర్శనమని అన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి బీవీఎస్ఎల్ రాజకుమారి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి ఎం. జ్యోతిలక్ష్మిదేవి, దళిత జేఏసీ నాయకులు జంగా బాబురావు, ఎంఏ కేభీమారావు, ఇసుకపట్ల రఘుబాబు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ కృష్ణారావు

ఎస్పీ కృష్ణారావు నివాళి

స్థానిక జిల్లా ఎస్పీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి ఎస్పీ బి.కృష్ణారావు పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆశయాలను మనమంతా ఆదర్శంగా స్వీకరించి ముందుకు సాగినప్పుడు సమ సమాజం సాకారమవుతుందని ఆయన అన్నారు. ఏఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, ఆర్మ్‌డ్ డీఎస్పీ సుబ్బరాజు, ఎస్బీ సీఐ బి.రాజశేఖర్, డీసీఆర్‌బీ సీఐ వి.శ్రీనివాస్‌తోపాటు ఎస్పీ కార్యాలయం ఎస్సైలు, సిబ్బంది అంబేడ్కర్‌కు నివాళులర్పించారు.

నేటి నుంచి ఏపీఎస్పీ స్పోర్ట్స్ మీట్

కాకినాడ రూరల్: ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక పోలీసు (ఏపీఎస్పీ) రేంజ్-1 పరిధిలోని బెటాలియన్ల సిబ్బంది స్పోర్ట్స్, గేమ్స్ మీట్ మంగళవారం ప్రారంభ కానున్నాయి. ఈ పోటీలకు కాకినాడ రమణయ్యపేటలోని మూడో బెటాలియన్ ఆతిథ్యం ఇస్తోంది. బెటాలియన్ ప్రాంగణంలో మూడు రోజుల పాటు జరిగే ఈ స్పోర్ట్స్, గేమ్ మీట్‌లో విజయనగరం, విశాఖపట్నం, కాకినాడ, మంగళగిరి, నెల్లూరు బెటాలియన్లకు చెంది న క్రీడా బృందాలు హాజరు కానున్నాయి. ఈ పోటీల ను కమాండెంట్ నాగేంద్రరావు ప్రారంభించనున్నారు.

మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా సత్యనారాయణ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా కేవీ సత్యనారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 1991 బ్యాచ్‌కు చెందిన ఆయన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో సీఐగా, కాకినాడ ట్రాఫిక్ డీఎస్పీగా, రాజమహేంద్రవరం స్పెషల్ బ్రాంచి, ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్, పరవాడ డీఎస్పీగా విధులు నిర్వహించారు. రాష్ట్ర పోలీస్ ప్రధాన కార్యాలయంలో పని చేస్తుండగా సాధారణ బదిలీల్లో భాగంగా ఆయనను జిల్లా మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీగా నియమించారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 – 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	19,000
గటగట (వెయ్యి)	17,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	18,000
గటగట (వెయ్యి)	16,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 - 13,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,000 - 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

పోలీసుల పేరుతో సైబర్ నేరగాళ్ల ఫోన్లు

పిఠాపురం: సైబర్ నేరగాళ్లు బరితెగించేశారు. పోలీసుల పేరు చెప్పి నేరాలకు తెగబడుతున్నారు. దీంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక బాధితులు తల పట్టుకుంటున్నారు. నాలుగు రోజులుగా పలువురికి సైబర్ నేరగాళ్ల నుంచి ఫోన్లు వస్తున్నాయి. ఎస్సై గారు ఇంట్లో వాళ్లకి ఒంట్లో బాగోలేదు. డబ్బులు అర్జెంట్‌గా వేయండి అంటూ ఫోన్ చేస్తున్నారు. ఎస్సై గారు మిమ్మల్ని డబ్బులు అడగమన్నారు. మీరు వేయండి తర్వాత వచ్చి మాట్లాడుదురు గాని అంటూ నమ్మబలుకుతున్నారు. ఇటీవల కలెక్టర్ గారికి అర్జెంటుగా డబ్బులు కావాలి వేయండి అంటూ నమ్మబలికిన ఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. గొల్లప్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలో ఇప్పటికి పలువురికి ఈరకమైన ఫోన్లు రావడంతో స్థానికులు పోలీసులు దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై అప్రమత్తమైన గొల్లప్రోలు ఎస్సై ఎస్.రామకృష్ణ సోషల్ మీడియా వేదికగా ప్రజల్ని అప్రమత్తం చేస్తున్నారు. ఇది సైబర్ నేరగాళ్ల పన్నాగమని, ప్రజలు ఎవరూ నమ్మి మోసపోవద్దని హెచ్చరికలు జారీ చేశారు. అటువంటి ఫోన్ కాల్స్ వస్తే వెంటనే పోలీసులు సంప్రదించాలని సూచిస్తున్నారు. ఫోన్ కాల్స్ వచ్చిన వారి ఫోన్ డేటాను పరిశీలిస్తున్నారు. ఈ ఫోన్ కాల్స్‌పై సైబర్ క్రైమ్ పోలీసులు దృష్టి సారించారు. ఇటువంటి ఫోన్ కాల్స్ వస్తే ఎవ్వరూ డబ్బులు వెయ్యొద్దని సూచిస్తున్నారు.

ఔషధ గుణం.. ఆరోగ్య ప్రదం

- తాటిముంజలతో శరీరానికి విటమిన్లు పుష్కలం
- ప్రస్తుత సీజన్‌లో విపరీతమైన డిమాండ్
- ఐస్ యాపిల్‌గా ప్రాచుర్యం

అలమూరు: వేసవి తాపాన్ని అధిగమించేందుకు, శరీరంలో సంభవించే అనేక రుగ్మతలను నివారించి ఆరోగ్య ప్రయోజనాలను చేకూర్చేందుకు ప్రకృతి ప్రసాదించిన తాటిముంజలు ఐస్ యాపిల్‌గా విశేష ప్రాచుర్యం పొందాయి. ఈ తాటిముంజల సీజన్ ఇప్పుడే ప్రారంభం కావడంతో, వీటికి విపరీతమైన డిమాండు ఏర్పడింది. తాటికాయలు ముంజల దశలో జెల్లీ మాదిరిగా, పట్టుకుంటే జారిపోయేంత మృదువుగా ఉంటాయి. మరో మూడు నెలల్లో తాటి ముంజలు తాటిపండ్లుగా మారడంతో పాటు, ఆరోగ్యకరమైన తేగలనూ ఇస్తాయి. ఈ తాటిముంజలు శరీరంలోని చక్కెర, ఖనిజాల ప్రమాణాలను సమతుల్యం చేసే లక్షణం కలిగి ఉన్నందున వీటికి విపరీతమైన డిమాండు ఉంటుంది.

కాలక్రమంలో..

గ్రామీణ ప్రాంతాల్లో తాటి చెట్లు అధికంగా ఉండేవి. తాటిముంజల లభ్యత ఎక్కువగా ఉన్నా.. చెట్లు ఎక్కి ముంజకాయలు దింపే కార్మికుల కొరత ఏర్పడడంతో వీటి లభ్యత నానాటికీ తగ్గిపోతోంది. ఎలుకల బెడద కారణంగా పొలాల్లో, రియల్ ఎస్టేట్ కారణంగా మారుమూల గ్రామాల్లో సైతం తాటిచెట్లను నరికేస్తుండటంతో భవిష్యత్తులో ఇవి కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడిందన్న ఆందోళన ఉంది.



తాటిచెట్టుకు కాసిన ముంజకాయలు

ఆరోగ్య ప్రదాయినిగా..

ప్రకృతిలో విరివిగా లభ్యమయ్యే ఈ తాటిముంజలు కల్తీ లేని, స్వచ్ఛమైనవి కావడంతో ఆరోగ్య ప్రదాయినిగా భావిస్తుంటారు. జిల్లాలో తాటిముంజలు సేకరించే వారు కరవయ్యారు. దీంతో మైదాన ప్రాంతాల్లో ఉన్న డిమాండును దృష్టిలో ఉంచుకుని కొందరు మెట్ట, ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన రైతు కూలీలు తాటిముంజలను పట్టణ ప్రాంతాల్లో విక్రయిస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో తాటిముంజల సీజన్ ప్రారంభమైంది. తాటిముంజుల పరిమాణాన్ని బట్టి డజను రూ.80 నుంచి రూ.120 వరకూ విక్రయిస్తున్నారు. ధర ఎక్కువగా ఉన్నా తాటిముంజల ప్రియులు దీనిని లెక్కచేయడం లేదు. లేలేతగా ఉండే తాటిముంజలు అద్భుత రుచితో నోరూరిస్తున్నాయి.



కోయడానికి సిద్ధంగా..

ప్రయోజనాలివే..

- తాటిముంజల్లో విటమిన్లు, ఫాస్పరస్, థయామిన్, బీ-కాంప్లెక్స్, కాల్షియం, పొటాషియంతో పాటు, సోలెబుల్ ఫైబర్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి.
- వీటిలో నీటి శాతం ఎక్కువగా ఉండటం వల్ల డీహైడ్రేషన్ నుంచి ఉపశమనం కలిగిస్తుంది. వేసవితాపం, వడదెబ్బ నుంచి రక్షణ కల్పిస్తుంది. వికారం, వాంతులను నివారిస్తుంది.
- తాటిముంజలను తినడం వల్ల శరీరంలో పేరుకున్న హానికర వ్యర్థ పదార్థాలను బయటకు పంపడంతో పాటు, రక్తపోటును అదుపులో ఉంచుతుంది.
- వేసవిలో ఏటా సీజన్‌లో క్రమం తప్పకుండా తాటిముంజలను తినడం ద్వారా చెడు కొలస్ట్రాల్‌ను తగ్గించుకుని, మంచి కొలస్ట్రాల్‌ను వృద్ధి చేసుకోవచ్చు. లివర్‌ను ఆరోగ్యంగా ఉంచుకోవచ్చు.



- వీటిలో తక్కువ మొత్తంలో క్యాలరీలు, ఎక్కువ మొత్తంలో పోషకాలుండటం వల్ల అలసట, నిర్జలీకరణం నుంచి ఉపశమనం కలిగించి, శరీర బరువు పెరగకుండా చేస్తుంది.
- వీటిలో ఉండే పోషకాలు జీర్ణ సంబంధ సమస్యలను తగ్గించి, జీర్ణ ప్రక్రియను మెరుగు పరుస్తాయి.
- ఆహారం సక్రమంగా జీర్ణమై గ్యాస్, ఎసిడిటీ, ఉదర సంబంధ సమస్యల నివారణకు దోహదపడుతుంది.
- మహిళల్లో రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశాలను బాగా తగ్గిస్తుంది. వేసవిలో వచ్చే చికెన్ ఫాక్స్‌ని నివారించి, శరీరాన్ని చల్లగా ఉంచుతుంది.
- తాటిముంజల్ని గుజ్జుగా చేసి ముఖానికి పూతలా వేస్తే చర్మం ప్రకాశవంతంగా మారుతుంది.
- చర్మానికి కావాల్సినంత తేమను అందించి చెమటకాయల్ని నివారిస్తుంది. ఎండ వేడిమికి ముఖంపై ఏర్పడే మచ్చలను తగ్గిస్తుంది.

ఆరోగ్య రక్షణకు దోహదం



వేసవి నుంచి వర్షాకాలం ప్రారంభం వరకూ లభ్యమయ్యే తాటిముంజలను తినడం వల్ల సంపూర్ణ ఆరోగ్య రక్షణ లభిస్తుంది. పోషకాలు అధికంగా ఉండటంతో పాటు, వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుంది. సీజన్ సమయంలో ప్రతి ఒక్కరూ భుజించాల్సిన అవసరం ఉంది.

– ఏవీవీ రాజా అక్కుల, హెల్త్ ఎడ్యుకేటర్, పెదపళ్ల, ఆలమూరు మండలం

చక్కని ఆరోగ్యం లభిస్తుంది



తాటిముంజలు తింటే చక్కని ఆరోగ్యం లభిస్తుంది. ఐస్ యాపిల్‌గా పిలిచే తాటిముంజలను ఏడాదికి ఒకసారైనా తినాలని కోరిక ఉంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో అంతంతమాత్రంగానే లభ్యమవుతుండటం వల్ల తాటిముంజలను కొనుగోలు చేయకతప్పడం లేదు,

– ఎ.రామసీత, గృహిణి, ఆలమూరు

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు



ఏసురత్నం (ఫైల్)

కొవ్వూరు: కాకినాడ జిల్లా పెద్దాపురంలో శంకరయ్యపేటకి చెందిన వీరవాసరపు ఏసురత్నం అనే వివాహిత 14వ తేదీ తెల్లవారుజాము మూడు గంటల నుంచి కనిపించడం లేదని అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. కొవ్వూరులో ఉంటున్న ఆమె అత్త వారి ఇంటికి వేసవి సెలవుల నిమిత్తం వచ్చినట్లు ఆమె తల్లి ఏలేశ్వరపు దుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లి మరలా తిరిగి రాలేదని పేర్కొన్నారు. ఆచూకీ కోసం పలు చోట్ల వెతికినప్పటికీ ఫలితం లేకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. వివరాలు తెలిస్తే 94407 96622 నంబర్‌కు తెలియజేయాలని ఆయన సూచించారు.

కొబ్బరితోటలో పిడుగు పడి మంటలు



గొంది కొబ్బరి తోటలో పిడుగుపాటుకు ఎగసిపడుతున్న మంటలు

సఖినేటిపల్లి: మండల పరిధిలోని గొంది గ్రామంలో ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపులతో భారీ శబ్దంతో పడిన పిడుగుపాటుకు ఒక రైతు కొబ్బరి తోటలో మంటలు ఎగిసి పడ్డాయి. మంటలను స్థానికులు నీళ్లతో ఆర్పివేశారు. పిడుగుపాటుకు చెట్లకు నష్టం వాటిల్లింది.

ఫుడ్ పాయిజనింగ్‌పై సమాచారం లేదు

- మీడియాలో చూసి వచ్చాం
- బాధితులతో మాట్లాడాం, అవంతి సీఫుడ్స్‌కు వెళ్లి పరిశీలిస్తాం
- జిల్లా వైద్యాధికారి నరసింహనాయక్



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శిస్తున్న జిల్లా వైద్యాధికారి, ఫుడ్ కంట్రోలర్

జగ్గంపేట: ఏలేశ్వరం మండలం పెద్దనాపల్లి గ్రామంలోని అవంతి సీఫుడ్స్‌లో రెండు రోజుల క్రితం ఫుడ్ పాయిజనింగ్ జరిగి 25 మంది ఆసుపత్రిలో చేరినా కంపెనీ నుంచి కాని, బాధితులకు చికిత్స చేస్తున్న జగ్గంపేటలోని ఆసుపత్రి నుంచి కాని తమకి సమాచారం లేకపోవడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నామని జిల్లా వైద్యాధికారి నరసింహం నాయక్ తెలిపారు. సీఫుడ్స్‌లో ఫుడ్ పాయిజినింగ్ వల్ల జగ్గంపేటలోని శ్రీ రామచంద్ర ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను సోమవారం జిల్లా వైద్యాధికారి నరసింహం నాయక్, జిల్లా అసిస్టెంట్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాస్ పరామర్శించారు. రెండు రోజుల క్రితం సీఫుడ్స్ క్యాంటీన్‌లో ఏ ఆహారం తీసుకున్నారు, ఎక్కడ తేడా జరిగింది, సమాచారం బయటకు రాకుండా ఎందుకు దాచారు వంటి వివరాలను బాధితుల నుంచి సేకరించారు. అనంతరం మీడియాతో జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ రెండు రోజుల క్రితం సీఫుడ్స్ క్యాంటీన్‌లో ఇడ్లీ, చట్నీ తీసుకున్న వారికి, దీంతోపాటు రాత్రి బిర్యాని తిన్నవారికి కూడా ఫుడ్ పాయిజనింగ్ అయిందని తెలిపారు. జగ్గంపేట ఆసుపత్రిలో మొత్తం 25మంది జాయిన్ అయ్యారని, వీరందరు వాంతులు విరేచనాలు, కడుపునొప్పితో బాధపడ్డారని చెప్పారు. కొంతమందిని ఒక రోజు అనంతరం డిశ్చార్జ్ చేశారని తెలిపారు. అవంతి సీఫుడ్స్‌కు వెళుతున్నామని పూర్తి వివరాలు సేకరించి, తదుపరి చర్యలు చేపడతామని చెప్పారు.

శ్యాంపిల్స్ సేకరించాం

అవంతి సీఫుడ్స్‌కు, క్యాంటీన్‌కు సెంట్రల్ ఫుడ్ సేఫ్టీ స్టాండర్స్ అథారిటీ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ-పాసీ) లైసెన్సు ఉందని, అయితే ఇక్కడ జరిగిన ఫుడ్ పాయిజనింగ్‌పై వారికి సమాచారం అందించామని జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ బి.శ్రీనివాస్ తెలిపారు. 20 కోట్ల టర్నోవర్ దాటిన కంపెనీలు, అందులోని క్యాంటీన్‌లు పాసీ పర్యవేక్షణలో వుంటాయని, ఆ సంస్థ ప్రతినిధులు మంగళవారం దీనిపై విచారణ చేపట్టనున్నారని ఆయన తెలిపారు. ప్రస్తుతం ఫుడ్, వాటర్ శ్యాంపిల్స్ సేకరించి ల్యాబ్‌కు పంపుతున్నామని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



సందీప్ (ఫైల్)



ఘటనా స్థలంలో రోదిస్తున్న తల్లి నాగమణి

రాయవరం: తల్లిదండ్రులు కుమారుడు భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. పదవ తరగతి పరీక్షలు రాసిన కుమారుడి ఫలితం కోసం ఎదురుచూస్తున్నారు. ఈలోపు రోడ్డు ప్రమాదంలో కుమారుడి మృతి వార్త తెలిసి తల్లిదండ్రులు హతాశులయ్యారు. రాయవరం మండలం సోమేశ్వరం గ్రామ పరిధిలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దుడ్డు సందీప్(16) మృతి చెందాడు. గ్రామానికి కూత వేటు దూరంలో జరిగిన ప్రమాదంలో సందీప్ ఘటనా స్థలంలోనే అసువులు బాసాడు. ఎస్సై సురేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం..సందీప్ లొల్ల వైపు నుంచి సోమేశ్వరం గ్రామానికి మోటార్ సైకిల్‌పై వస్తున్నాడు. స్నేహితుల వద్ద మోటార్ సైకిల్ తీసుకుని వెళ్లినట్లు సమాచారం. మోటార్ సైకిల్‌పై వేగంగా గ్రామానికి వస్తున్న సమయంలో జేబు నుంచి సెల్ ఫోన్ తీసుకునే క్రమంలో మోటార్ సైకిల్ అదుపు తప్పింది. దీంతో మోటార్ సైకిల్‌తో పాటుగా సందీప్ రోడ్డు పక్కన ఆగి ఉన్న లోడు వ్యాన్‌ను బలంగా ఢీకొట్టడంతో ఘటనా స్థలంలోనే చనిపోయాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని రామచంద్రపురం ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై సురేష్‌బాబు తెలిపారు.

'తల్లి'డిల్లిన పేగు

సందీప్ మరణ వార్త విన్న తల్లిదండ్రులు నాగమణి, తాతారావుల వేదన వర్ణనాతీతంగా ఉంది. దేవుడా..ఎంత పని చేశావు. ఎన్నో ఆశలు పెట్టుకుని, కంటికి రెప్పలా కాపాడుకుంటున్న ఒక్కగానొక్క కుమారుడిని నీ దగ్గరకు తీసుకుని వెళ్లిపోయావా..అంటూ ఘటనా స్థలంలో తల్లి నాగమణి విలపించిన తీరు కంటతడి పెట్టించింది. పదవ తరగతి అనంతరం కళాశాలలో చేర్పించాలని భావిస్తున్నామని, ఇంతలోనే ఎంత ఘోరం జరిగిపోయిందంటూ తల్లి నాగమణి విలపించింది. తాము ఇంక ఎవరి కోసం బతకాలంటూ తల్లిదండ్రులు బోరున విలపించారు.

సరదా తెచ్చిన తంటా

- గోదావరి నదిలో స్నానానికి దిగి ఇద్దరు యువకుల గల్లంతు
- మరొకరిని కాపాడిన స్థానికులు
- గల్లంతైన ఇద్దరూ నిడదవోలు వాసులే



గోదావరిలో యువకుల ఆచూకీ కోసం పడవలతో గాలింపు

కొవ్వూరు: విజ్జేశ్వరం లాకులకు దిగువన చిగుర్లంక వద్ద సరదాగా స్నానానికి వెళ్లిన ముగ్గురు యువకుల్లో ఇద్దరు యువకులు గల్లంతయ్యారు. మరొకరిని స్థానికులు కాపాడారు. సోమవారం సాయంత్రం నిడదవోలు చర్చిపేటకి చెందిన మర్తి ప్రకాష్‌కుమార్ (15), రాజమహేంద్రవరానికి చెందిన గంధం హర్ష(18), మరో యువకుడు స్నానం చేసేందుకు చిగుర్లంక వద్ద గోదావరి పాయ వద్దకు వచ్చారు. స్నానాలు ఆచరిస్తున్న ప్రదేశంలో లోతు తక్కువగా ఉందని భావించి నదిలోకి దిగారు. వారు దిగిన ప్రదేశానికి కొద్ది దూరంలోనే లోతు ఎక్కువగా ఉండడంతో నీట మునిగారు. ఒకరిని ఒకరు కాపాడుకునే ప్రయత్నంలో ఇద్దరు యువకులు గల్లంతయ్యారు. అక్కడే సమీపంలో ఉన్న ఆరుగురు యువకులు గుర్తించి కాపాడే ప్రయత్నం చేశారు. అప్పటికే ప్రకాష్‌కుమార్, హర్ష నదిలో గల్లంతయ్యారు. మరో యువకుడిని కాపాడి ఒడ్డుకు చేర్చారు. సమాచారం తెలుసుకున్న రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. ప్రమాద ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆర్డీవో రాణి సుస్మిత, డీఎస్పీ జి.దేవకుమార్ సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. రూరల్ ఎస్సై కె.శ్రీహరిరావు, తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ జాలర్లు, గజ ఈతగాళ్ల సాయంతో సహాయక చర్యలు చేపట్టారు. ఇదే ప్రదేశంలో రెండేళ్ల క్రితం స్నానాలకు దిగి పురుషోత్తపల్లి గ్రామానికి చెందిన అక్కాచెల్లెళ్లు మృత్యువాత పడ్డారు.

హర్ష తండ్రి మూడు నెలల క్రితమే మృతి



మర్తి ప్రకాష్‌కుమార్ (ఫైల్)



గంధం హర్ష (ఫైల్)

గోదావరిలో గల్లంతైన హర్ష ప్రస్తుతం వైజాగ్‌లో ఇంటర్ మీడియట్ చదువుతున్నాడు. తండ్రి మూడు నెలల క్రితమే మృతి చెందారు. తల్లి శైలజ రాజమహేంద్రవరంలో ఓ ప్రయివేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తున్నారు. హర్ష పెద్ద సోదరి అబిల పోలియో వ్యాధి బారిన పడింది. రెండో సోదరి హేనాకి వివాహం చేశారు. అంబేద్కర్ జయంతి, వేసవి సెలవులను పురస్కరించుకుని నిడదవోలులో ఉంటున్న అక్క హేనా ఇంటికి వచ్చారు. గతంలో హర్ష కుటుంబం నిడదవోలులోనే ఉండేవారు. సోమవారం మధ్యాహ్నం వరకు అంబేద్కర్ జయంతి వేడుకలో పాల్గొని భోజనం చేసి వచ్చాడని హర్ష చిన్నాన్న మల్లవరపు వినోద్ చెబుతున్నారు. హర్ష తండ్రి మృతి చెంది మూడు నెలలు అయ్యింది. ఇంతలోనే సెలవులకని వచ్చి హర్ష గల్లంతు కావడం జీర్ణించుకోలేక పోతున్నామని అన్నారు. బయటికి వెళ్లి గంటలో వచ్చేస్తానని చెప్పాడని, ఇంతలో ఇలాంటి వార్త వినాల్సి వస్తుందనుకోలేదని కన్నీటి పర్యంతం అయ్యారు.



చిగుర్లంక గ్రామంలో ఘటన వివరాలు తెలుసుకుంటున్న మంత్రి దుర్గేష్

పదో తరగతి పరీక్ష రాశాడు

మృతుడు మర్తి ప్రకాష్‌కుమార్ పదో తరగతి పూర్తి చేశారు. తండ్రి కిషోర్ ప్రయివేటు అంబులెన్స్ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. తల్లి కువైట్‌లో ఉంటున్నారని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ప్రకాష్‌కుమార్‌కి సోదరుడు ఉన్నారు. ప్రస్తుతం ఇంటర్ మీడియట్ చదువుతున్నారు. కుమారుడు గల్లంతైన విషయం విదేశాల్లో ఉన్న తల్లి తెలుసుకుని తల్లడిల్లిపోతోంది.

ప్రమాదంపై మంత్రి దిగ్భ్రాంతి

గోదావరి నదిలో స్నానానికి దిగి యువకులు గల్లంతు కావడం బాధాకరం అని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గజ ఈతగాళ్లతో పాటు కాకినాడ నుంచి ఎన్‌డీఆర్ఎఫ్ బృందాన్ని రప్పిస్తున్నామన్నారు. మత్స్యశాఖ, అగ్నిమాపక సిబ్బంది గజ ఈతగాళ్ల సాయంతో నదిలో యువకుల ఆచూకీ కోసం గాలిస్తున్నారని చెప్పారు. ఇటీవల తాడిపూడిలో ఐదుగురు మృతి చెందడం,ఇప్పుడు ఈ ప్రమాదం బాధాకరం అన్నారు.

ఇసుక లారీ చెట్టుకు ఢీకొని వ్యక్తి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు

కాజులూరు: కాకినాడ – కోటిపల్లి రహదారిలో కాజులూరు మండలం జగన్నాథగిరి వద్ద సోమవారం ఇసుక లారీ చెట్టును ఢీకొట్టడంతో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యక్తి తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. గొల్లపాలెం పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కరప మండలం నడకుదురుకు చెందిన రావుల శ్రీనివాసరావు లారీపై రామచంద్రపురం మండలం ద్రాక్షారామ శివారు వేగాయమ్మపేటకు చెందిన పిల్లి శ్రీనివాసు డ్రైవరుగానూ, మరో యువకుడు క్లీనర్‌గానూ పనిచేస్తున్నారు. వీరు తరచూ కోటిపల్లి, కపిలేశ్వరపురం తదితర ఇసుకర్యాంపుల నుంచి కాకినాడకు ఇసుక తరలిస్తుంటారు. సోమవారం క్లీనర్ సెలవు పెట్టడంతో ఓనరైన రావుల శ్రీనివాసరావు లారీ ఎక్కాడు. ఈ క్రమంలో డ్రైవరైన పిల్లి శ్రీనివాసును క్లీనరు సీటులో కూర్చోబెట్టి తాను డ్రైవింగ్ చేస్తున్నాడు. జగన్నాథగిరి కెనాల్ రోడ్డుకు వచ్చేసరికి డ్రైవింగ్ అదుపు తప్పి వేగంగా వెళుతున్న లారీ రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీ కొట్టింది. ఈ ఘటనలో చెట్టు వేర్లతో సహా పైకి వచ్చి పడిపోగా లారీ ముక్కలు,ముక్కలుగా విరిగి పల్టీ కొట్టింది. డ్రైవరు సీటులో ఉన్న రావుల శ్రీనివాసరావు, క్లీనరు సీటులో ఉన్న పిల్లి శ్రీనివాసు లారీ శకలాలు కింద ఇరుక్కున్నారు. స్థానికులు గమనించి గొల్లపాలెం పోలీసులకు సమాచారమివ్వగా పోలీసులు వచ్చి జేసీబీ సహాయంతో లారీ శకలాల కింద ఉన్న ఇద్దరిని బయటకు తీశారు. అయితే అప్పటికే లారీ ఓనరు రావుల శ్రీనివాసరావు (50) మృతి చెందగా డ్రైవరు పిల్లి శ్రీనివాసు తీవ్ర గాయాలపాలయ్యాడు. 108 అంబులెన్సులో స్థానికులు అతనిని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గొల్లపాలెం ఎస్సై ఎం మోహన్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



చెట్టును ఢీకొట్టి బోల్తా పడిన లారీ



లారీ శకలాల కింద ఇరుక్కుని మృతి చెందిన రావుల శ్రీనివాసరావు

రోడ్డు ప్రమాదంలో..

కొత్తపల్లి: ఉప్పాడ- కోనపాపపేట రోడ్డులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందగా మరో నలుగురు వ్యక్తులకు గాయాలైనట్లు పోలీసులు సోమవారం తెలిపారు. అనకాపల్లి జిల్లా కొత్తకోట గ్రామానికి చెందిన ఎద్దు దుర్గాప్రసాద్(25) కేఎస్ఈజడ్‌లో ఉన్న సంధ్య రొయ్య శుద్ధి పరిశ్రమలో పనిచేస్తున్నాడు. తనతోపాటు పనిచేస్తున్న నవదీప్, నవీన్‌లతో కలిసి మెస్ నుంచి మోటారు సైకిల్‌పై వస్తున్నాడు. ఉప్పాడ వైపు నుంచి మోటారు సైకిల్‌పై మరో ఇద్దరు బీచ్‌రోడ్డులో కోనపాపపేట వైపు వెళుతూ కేఎస్ఈజడ్ సమీపంలో పరిశ్రమలకు వెళ్లే రోడ్డులో ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో దుర్గాప్రసాద్ మృతిచెందగా నలుగురికి గాయాలయ్యాయి. వారిని కాకినాడలోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి.వెంకటేష్ తెలిపారు.

రైల్వే గేటు వద్ద..

అన్నవరం: గొల్లప్రోలు మండలం మల్లవరం రైల్వే గేటు వద్ద పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని తుని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించినట్టు అన్నవరం రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్యాం త్రినాథ్‌రావు తెలిపారు. రైలు ఢీ కొట్టడం లేదా, ప్రయాణిస్తున రైలులో నుంచి జారి పడిపోవడం వలన మృతి చెందినట్టు భావిస్తున్నామని తెలిపారు. మృతుని వయసు 45 సంవత్సరాలు ఉంటుందని శరీరంపై దుస్తులు లేవని తెలిపారు. కుడి చేతికి కడియం, ఎడమచేతి మీద పెద్ద పచ్చబొట్టు ఉందని తెలిపారు. మృతుని ఆచూకీ తెలిపినవారు తుని రైల్వే ఎస్ఐ జీ శ్రీనివాసరావును సంప్రదించాలని కోరారు.

విద్యుదాఘాతానికి..

రౌతులపూడి: మండలంలోని గిడజాం గ్రామానికి చెందిన ఎర్రా నాగేశ్వరరావు(38) విద్యుదాఘాతానికి గురై సోమవారం మృతిచెందాడు. ఎప్పటిలాగే గిడజాం శివారు ఒక ప్రయివేటు వ్యవసాయ క్షేత్రంలో పనికోసం వెళ్లిన ఎర్రయ్య చెట్ల కొమ్మలు నరుకుతుండగా వాటికి వేలాడుతున్న 11 కేవీ విద్యుత్ తీగలకు తగలడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న రౌతులపూడి ఎస్.ఐ వెంకటేశ్వరరావు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామన్నారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి తరలిస్తున్నట్లు ఆయన తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.